## క్లుప్తంగా

### వీరమ్మ తల్లిని దర్శించుకున్న మాజీ ఎంపీ



ఉయ్యూరు: కృష్ణాజిల్లాను అభివృద్ధి పరిచి పూర్వ వైభవాన్ని తీసుకు రావాలని మాజీ రాజ్య సభ సభ్యుడు యలమంచిలి శివాజీ అన్నారు. ఉయ్యూరు వీరమ్మతల్లి అమ్మవారిని గురువారం ఆయన దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ అభివృద్ధి అంటే కృష్ణాజిల్లా అనేది ఒకప్పటి మాట అన్నారు. జిల్లాలో రైతాంగం వరి పంటపై పూర్తిగా ఆధారపడటంతో వెనుకబాటు తనం పెరిగిందన్నారు. వాణిజ్య పంట చెరకు గిట్టుబాటు ధర లేకపోవటంతో ఏం చేయాలో తెలియని స్థితిలో రైతులు ఉన్నారన్నారు. ప్రభుత్వం బందరు పోర్టును అందుబాటులోకి తెచ్చి కృష్ణాజిల్లాకు పూర్వ వైభవం తేవాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా అభివృద్ధి, బందరు పోర్టు నిర్మాణంపై దృష్టి సారించాలని కోరారు.

### వైభవంగా కల్యాణ మహోత్సవం



కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లిలో వేం చేసి ఉన్న శ్రీభద్రావతి సమేత భావనారుషిస్వామి వార్ల దేవస్థానంలో గురువారం వార్షిక కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. తొలుత స్వామివారికి అభిషేకాలు నిర్వహించి, నూతన వస్త్రాలను సమర్పించారు. అనంతరం శ్రీభద్రావతి సమేత భావనారుషిస్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ వేదికపై తీసుకువచ్చారు. వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాలు, వందలాది మంది భక్తుల సమక్షంలో సుముహూర్తంలో స్వామి వారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన చేశారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై స్వామివార్ల ఉత్సవమూర్తులను ఉంచి గ్రామోత్సవం జరిపారు. పలువురు గ్రామ ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### నాణ్యమైన పోషకాహారం అందజేయాలి



ఉంగుటూరు: శిక్షణ తరగతుల్లో తెలుసుకున్న విషయాలను అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు చేసి నాణ్యమైన పోషకాహారం, విద్యను అందించాలని ఎంఈవో సాంబశివరావు సూచించారు. ఉంగుటూరు జెడ్పీ హైస్కూల్‌లో మూడు రోజులుగా జరుగుతున్న జ్ఞాన జ్యోతి శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. ఈ నెల 22, 24, 25వ తేదీల్లో మరొక బ్యాచ్‌కు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని సీడీపీఓ వెంకటలక్ష్మి పేర్కొన్నారు. శిక్షణ తరగతులు అంగన్‌వాడీ సిబ్బందికి ఎంతగానో ఉపయోగకరమని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అనిత, సూపర్‌వైజర్లు పద్మాదేవీ, దుర్గాదేవీ అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ఏడో రోజుకు చేరిన రిలే దీక్షలు

ఉయ్యూరు: చార్ట్ కౌన్సెలింగ్ ప్రక్రియ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఉయ్యూరు ఆర్టీసీ డిపోలో ఎన్‌ఎంయూ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు గురువారంతో ఏడో రోజుకు చేరాయి. దీక్షలో అసోసియేషన్ ప్రతినిధులు సాంబశివరావు, జీవీ రావు కూర్చున్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి, కోశాధికారి గణేష్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు డీవీ రావు, ప్రతినిధులు ఆవుల శ్రీనివాసరావు, పీఎం కృష్ణ, తదితరులు పాల్గొని ఆందోళన నిర్వహించారు. నోటీసు బోర్డు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### 23 నుంచి స్వర్ణభారత్ ట్రస్ట్‌లో హోమియో వైద్యశిబిరం

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం ఆత్కూరులోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో జి.వి.చలపతి మెమోరియల్ హోమియో సెల్ఫ్‌రిలియన్స్ ఫోరం(బెంగళూరు) ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి 26వరకు ఉచిత హోమియో వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ డైరెక్టర్ పరదేశి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రముఖ వైద్యులు పి.వి.సత్యనారాయణ నేతృత్వంలో వైద్య బృందం పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. ప్రతి రోజు ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిబిరం కొనసాగుతుందని తెలిపారు. ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని, వివరాలకు 93430 94787 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

# మునిగిరి కొండపై మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు

- 25 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- 26వ తేదీ రాత్రి స్వామివారి కల్యాణోత్సవం
- యనమలకుదురు ఆలయంలో చురుగ్గా జరుగుతున్న ఏర్పాట్లు

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించటానికి ఏర్పాట్లు చేస్తున్నారు. కృష్ణానది తీరంలో శ్రీస్వామివారి మహాశివరాత్రి ఉత్సవాలు ప్రతి ఏడాది అత్యంత వైభవంగా జరుగుతాయి. ఈ నెల 26వ తేదీ మహాశివరాత్రి సందర్భంగా రాత్రి 2.16 గంటలకు శ్రీపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహిస్తారు.



యనమలకుదురు ఆలయం



ఆలయంలో వేంచేసి ఉన్న రామలింగేశ్వరుడు

### స్థల పురాణం..

విజయవాడకు సమీపంలో యనమలకుదురు గ్రామంలో మునిగిరి కొండపై శ్రీ రామలింగేశ్వరస్వామి కొలువై ఉండి భక్తులకు కొంగు బంగారమై భాసిల్లుతున్నారు. శివుడు ఇక్కడ స్వయంభూగా వెలిశాడు. శివుడు ఇక్కడ రామలింగేశ్వరుడిగా ఉన్నట్లు పురాణాలు చెబుతున్నాయి. వాయిలింగాకారంలో శివుడు ఇక్కడ ఉన్నాడు. యనమలకుదురు మునిగిరి కొండ తపస్సుకు అనువుగా ఉండటంతో విష్ణుమూర్తి ఆరో అవతారమైన పరుశురాముడు కొన్ని వేల సంవత్సరాల క్రితం ఈ ప్రాంతానికి వచ్చి శివుడి కోసం తపస్సు చేశాడని చెబుతారు. యజ్ఞం పూర్తి చేసిన తరువాత శివలింగాన్ని ప్రతిష్ఠించి ప్రాణప్రతిష్ట చేశాడని స్థల పురాణం చెబుతోంది. వెయ్యి మంది మునులు ఇక్కడ తపస్సు చేయటంతో వేయి మునులకుదురుగా పేరు పొంది కాలక్రమేణా యనమలకుదురుగా మారింది. భూమికి దాదాపు 625 అడుగుల ఎత్తులో మునిగిరి కొండపై ముఖద్వారంలో ఎత్తయిన హనుమంతుడు స్వాగతం పలుకుతారు.

### నందీ ముద్దలు - గండ దీపం

మహాశివరాత్రి సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు ఇక్కడ మొక్కుబడులు తీర్చుకుంటారు. శ్రీరామలింగేశ్వరుడు మహాశక్తి వంతుడని భక్తుల నమ్మకం. పిల్లలు పుట్టని వారు సంతానం కోసం ధ్వజ స్తంభానికి వస్త్రాలు కప్పి నందీముద్దలు(పులగం)పైకి విసురుతారు. అవి చీరకొంగులో పడితే వారికి పిల్లలు పుడతారని నమ్మకం. అలాగే కొండ పైకి ఉన్న మెట్లను కడిగి పసుపు కుంకుమ రాసి మొక్కలు తీర్చుకుంటారు. భక్తులు గండదీపం తలపై పెట్టి నేలపై చీరలు పరిచి ఆ చీరలపై నడుచుకుంటూ కొండ పైకి వెళ్లి స్వామివారిని దర్శించుకుంటారు. ఆలయంలో వినాయకుడు, హనుమంతుడు, నాగేంద్రస్వామి, వీరభద్రుడు, దక్షిణమూర్తి చండీశ్వరుడు, నందీశ్వరుడు, నవగ్రహాలు, సుబ్రహ్మణ్యస్వామి ఇలా అనేక మంది దేవతామూర్తులు కొలువై ఉన్నారు. భక్తులు కృష్ణానదిలో పుణ్య స్నానాలు చేయటానికి ఏర్పాట్లు చేశారు.

### ప్రత్యేక ఆకర్షణగా ప్రభల ప్రదర్శన..

మహాశివరాత్రి ఉత్సవాల్లో ప్రభలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. దేవుడి ప్రభతో పాటు కొండ చుట్టూ దాదాపు 60 ప్రభలు రంగురంగుల దీపాలతో అలంకరించి రాతి చక్రాల రథంపై ఉంచి ఊరేగిస్తారు. ప్రభలు 70 అడుగుల ఎత్తులో ఉంటాయి. రాష్ట్రంలో ఇన్ని ప్రభలు ఒకేసారి తిప్పటం యనమలకుదురులోనే జరుగుతుంది. దేవుడి ప్రభ రాతి చక్రాలతో ఉన్న వాహనంపై ప్రత్యేకంగా అలంకరించి ఊరేగిస్తారు. దేవుడి ప్రభకు అధికారులు వేలంపాట నిర్వహిస్తారు. హెచ్చు పాటదారుడు దేవుడి ప్రభకు ఎడ్లను కట్టి దేవుడి ప్రభను గిరి చుట్టూ ప్రదర్శిస్తారు. శివరాత్రి రోజు రాధాకృష్ణకోలాటం, కోయ నృత్యాలు, హిరాణి నృత్యాలు, భేతాళ వేషధారణలు, ఇలా అనేక సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి.

### మహాశివరాత్రి కార్యక్రమం వివరాలు..

మహాశివరాత్రి మహోత్సవాలు ఈ నెల 25వ తేదీన ప్రారంభమవుతాయి. ఉదయం 8 గంటలకు స్వామివారిని పెళ్లి కుమారుడిని చేస్తారు. రాత్రి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 26వ తేదీన మహాశివరాత్రి సందర్భంగా స్వామివారి దర్శనం, ప్రభల ఊరేగింపు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. అర్ధరాత్రి 2.16 గంటలకు స్వామివారికి కల్యాణోత్సవాన్ని అయోధ్య శ్రీనివాసరావు దంపతులు కొండ దిగువున ఉన్న మండపంలో ఆలయ పూజారులతో కలిసి చేస్తారు. 27వ తేదీ ఉదయం గ్రామోత్సవం, 28వ తేదీ ఉదయం వసంతోత్సవం, త్రిశూలస్నానం, రాత్రి పవళింపుసేవ జరుగుతాయి.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: యనమలకుదురులో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. ఆయన గురువారం వివరాలు తెలుపుతూ యనమలకుదురులో మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా యనమలకుదురు సబ్‌స్టేషన్ పరిధిలో డొంక రోడ్డు, శివపార్వతీనగర్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. దీని కారణంగా శివప్రసాద్‌నగర్, గ్యాస్ గోడౌన్ ప్రాంతం, హోసన్నా మందిరం, గణపతినగర్, శ్రీనగర్, గ్రీన్‌సిటీ కాలనీలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

**రామవరప్పాడు పరిధిలో..**

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ పరమేశ్వరరావు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, నూతన స్తంభాల ఏర్పాటు నిమిత్తం గ్రామంలోని చిన్మయి ఏరియా, వాటర్ ట్యాంక్ రోడ్డు, పట్టెలవారి వీధి, ఎస్సీబి ఏరియా, రంగా విగ్రహం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు. ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

### ఉప్పలూరులో ఆధార్ నమోదు క్యాంపు

కంకిపాడు: ఉప్పలూరు సచివాలయంలో ఆధార్ నమోదు ప్రత్యేక శిబిరం గురువారం చేపట్టారు. 0–6 ఏళ్లలోపు చిన్నారుల ఆధార్ నమోదుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఎంపీడీఓ పి.అనూష పర్యవేక్షణలో సచివాలయ సిబ్బంది ఆధార్ క్యాంపును నిర్వహించారు. పలువురు స్థానికులు తమ చిన్నారులను సచివాలయానికి తీసుకువెళ్లి ఆధార్ నమోదు చేయించుకున్నారు.

## ఎంఎస్‌ఎంఈ సర్వే సక్రమంగా చేయాలి

**కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ**

పెనమలూరు: మైక్రో స్మాల్ మీడియం ఎంటర్‌ప్రైజెస్(ఎంఎస్‌ఎంఈ) సర్వే సక్రమంగా చేయాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. ఆయన గురువారం పోరంకిలో పర్యటించి సర్వే వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ బాలాజీ సిబ్బందితో మాట్లాడుతూ చిన్న, మధ్య, భారీ వ్యాపారాలు చేసే వారి వివరాలు సర్వే చేసి నమోదు చేయాలన్నారు. ఎంఎస్‌ఎంఈ సర్వే వలన కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలు వ్యాపారులకు అందుతాయన్నారు. సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు చిన్న వ్యాపారుల సర్వే మాత్రమే చేస్తున్నారని, పరిశ్రమల శాఖ నుంచి వచ్చిన డేటాను కూడా తీసుకోని సర్వే చేయాలని సూచించారు. ఆయన పోరంకి జిల్లా పరిషత్ పాఠశాల ప్రాంతంలో ఉన్న షాపులు సర్వేలో ఉన్నాయా లేదా అని పరిశీలించారు. అనంతరం మున్సిపాలిటీ కార్యాలయంలో సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ భవానీప్రసాద్, పరిశ్రమల శాఖ ఎండీ వెంకట్రావు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



పోరంకిలో అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ బాలాజీ

## పారిశుద్ధ్య కార్యక్రమాన్ని యజ్ఞంగా నిర్వహించాలి

గన్నవరంరూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పారిశుద్ధ్య కార్యక్రమాన్ని యజ్ఞంగా నిర్వహిస్తున్నాయని గుడివాడ డివిజనల్ పంచాయతీ అధికారి సంపత్ కుమారి చెప్పారు. మండలంలోని సూరంపల్లి సంపద కేంద్రం వద్ద గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్ర, షెడ్ మిత్రలకు గురువారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తడి, పొడి చెత్త సేకరణపై మరింత అవగాహన పెంచుకోవాలన్నారు. చెత్త సేకరణలో మెలకువలు పాటిస్తే వాటిని సంపద కేంద్రం వద్ద ఎరువుగా తయారు చేయటం సులభమని చెప్పారు. పారిశుద్ధ్య కార్మికులు తడి, పొడి చెత్తపై ప్రజల్లో అవగాహన తీసుకురావాలన్నారు. అప్పుడే ఇళ్ల యజమానులు తడి, పొడి చెత్తను వేర్వేరు డబ్బాలలో వేస్తారని చెప్పారు. ప్రభుత్వం ఈ పథకాన్ని విజయవంతం చేసేందుకు క్షేత్ర స్థాయి నుంచి విస్తృత అవగాహన కల్పిస్తోందన్నారు. దీన్ని యజ్ఞంగా భావించాలని కార్యదర్శులకు, మిత్రలకు ఆదేశాలిచ్చారు. మండల స్పెషలాఫీసర్ విజయసారథి, ఎంపీడీవో టి.స్వర్ణలత, ఈవోపీఆర్డీలు భారతి, లక్ష్మయ్య, ట్రైనర్ కృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శులు లక్ష్మణరావు, చెన్నకేశవులు, ప్రసాద్, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎల్‌పీవో సంపత్‌కుమారి

## వికాస్ విద్యార్థుల పారిశ్రామిక టూర్

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని వికాస్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు పారిశ్రామిక టూర్‌లో భాగంగా గురువారం సూరంపల్లిలోని సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీని సందర్శించారు. 36 మంది మెకానికల్, అగ్రికల్చర్ చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులు నలుగురు అధ్యాపకులు టూర్‌లో పాల్గొన్నారు. ప్లాస్టిక్ ఉపయోగం, ప్లాస్టిక్‌ను ఉపయోగించి వివిధ వ్యవసాయ ఉపకరణాలు, గృహోపకరణాలు తయారు చేసే పలురకాల మెషిన్లను విద్యార్థులు పరిశీలించారు. ప్లాస్టిక్ ఇంజినీరింగ్‌కు సంబంధించి డిప్లమో, పీజీ డిప్లమో కోర్సులు చేస్తున్న విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలను అధ్యాపకులు వివరించారు. సొంతంగా వ్యాపారం ప్రారంభించే వారికి ప్లాస్టిక్ తయారీ పరిశ్రమను ఏర్పాటు చేసుకునే విధానాన్ని విద్యార్థులకు తెలియజేశారు.



ప్లాస్టిక్ ఇండస్ట్రీలో వికాస్ విద్యార్థులు

## అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు

**క్షేత్రస్థాయి పర్యటనలో వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర**

పటమట(విజయవాడతూర్పు): అగ్ని ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం కార్మల్ నగర్‌లోని సెయింట్ మేరీ విజయ కాన్వెంట్, చుట్టుగుంటలోని మెట్రో హోల్ సేల్ మార్ట్‌ను సందర్శించారు. తొలుత సెయింట్ మేరీ విజయ కాన్వెంట్‌ను సందర్శించి అక్కడున్న ఫైర్ సేఫ్టీ పరికరాలను పరిశీలించారు. అగ్ని ప్రమాదం తలత్తిన వెంటనే ఎటువంటి చర్యలు తీసుకోవాలి వంటి అంశాలపై ఫైర్ సిబ్బంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే మెట్రో కాంపౌండ్‌లో ఫైర్ ఇంజిన్ తిరగటానికి అనుకూలంగా ఉందా లేదా అని పరిశీలించారు. అక్కడున్న మంటలను ఆర్పే పరికరాలు స్మోక్ డిటెక్టర్, ఫైర్ స్ప్రింక్లర్, ఈల్డ్ హైడ్రెంట్, తదితర అగ్ని ప్రమాద నివారణ పరికరాలను పరిశీలించారు. కరెంటు పోయినా ఎమర్జెన్సీ ఎగ్జిట్ కనపడేటట్టు రేడియం స్టిక్కర్లు దారిలో ఉండాలని సూచనలు ఇచ్చారు. మెట్రో మార్ట్ లో సెట్ బ్యాక్‌లో చిన్న లోపాలను గమనించి, ఉన్న లోపాలను సరిచేస్తేనే నో అబ్జెక్షన్ సర్టిఫికెట్‌ను జారీ చేస్తానని మెట్రో మేనేజర్‌కు స్పష్టం చేశారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ ప్రభుదాస్, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ మాల్యాద్రి, రీజినల్ ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రాజా, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీ ఎస్‌వీ ప్రసాద్, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు పాల్గొన్నారు

## ర్యాగింగ్‌తో భవిష్యత్ నాశనం

**అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ దామోదర్**

లబ్బీపేట(విజయవాడతూర్పు): ర్యాగింగ్‌కు పాల్పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కె. దామోదర్ అన్నారు. నగరంలోని కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాల ర్యాగింగ్ నిరోధక విభాగం ఆధ్వర్యంలో గురువారం ర్యాగింగ్ వల్ల విద్యార్థులకు ఎదురయ్యే ఇబ్బందులు, డ్రగ్స్ వాడకం, సైబర్ క్రైం వంటి అంశాలపై సదస్సు జరిగింది. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏసీపీ కె. దామోదర్ మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యల్లో భాగంగా మూడు నెలల నుంచి పదేళ్ల జైలుశిక్ష పడే అవకాశం ఉందన్నారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలున్నా కళాశాల ర్యాగింగ్ నిరోధక విభాగంతో పాటు, స్థానిక పోలీస్‌స్టేషన్ సహకారం తీసుకోవచ్చని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎ. సునీత మాట్లాడుతూ కళాశాలలో ర్యాగింగ్‌ను ఏ రూపంలోనూ ఉపేక్షించమన్నారు. మాచవరం సీఐ సీహెచ్ ప్రకాష్, సదస్సు కార్యనిర్వాహణాధికారి డాక్టర్ జి. రమణ తదితరులు పాల్గొన్నారు.

### ముమ్మరంగా డ్రైయిన్లలో పూడికతీత

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులో పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ తెలిపారు. గ్రామంలోని అంతర్గత రహదారుల్లోని చెత్తను తొలగించడంతో పాటు సైడు డ్రైయిన్లు గురువారం పూడిక తీశారు. సమస్యాత్మకంగా మారిన డ్రైయిన్లు గుర్తించి మురుగునీరు సజావుగా పారుదల అయ్యేందుకు పారిశుద్ధ్య సిబ్బందిచే చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. ప్రత్యేక పారిశుద్ధ్య చర్యల్లో భాగంగా ప్రతి రోజు వేకువజాము నుంచే పనులు ప్రారంభిస్తున్నామన్నారు. గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగు పరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రధాన గ్రామంతో పాటు అంతర్గత రహదారుల్లో పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నామన్నారు. గ్రామంలో సెయింట్ ఆన్స్ పాఠశాల రోడ్డు, వాటర్ ట్యాంక్ బజారు, రవీంద్ర భారతి పాఠశాల రోడ్డు, ఎస్సీ కాలనీ, కాల్వగట్టు ప్రాంతాల్లో చెత్తను తొలగించినట్లు తెలిపారు.

### నేటి నుంచి వీఆర్‌లో జాతీయ స్థాయి టెక్నో కల్చర్ ఫెస్ట్

పెనమలూరు: కానూరు వీఆర్ సిద్ధార్థ డీమ్డ్ టుబీ యూనివర్సిటీలో జాతీయ స్థాయి సుప్రజ్ఞ–2025(ఎఫోసిక్) నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ మందలపు రవిచంద్ తెలిపారు. ఆయన గురువారం వివరాలు తెలుపుతూ కాలేజీలో శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు జరగనున్న జాతీయ స్థాయిలో జరిగే సుప్రజ్ఞ–2025 ఉదయం 9 గంటలకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో టాటా కన్సల్టెన్సీ ఏపీ, తెలంగాణ హెడ్ ప్రవీణ్ అహ్మద్ పాల్గొంటారని అన్నారు. వివిధ కాలేజీల నుంచి విద్యార్థులు టెక్నో కల్చర్ ఫెస్ట్‌లో పాల్గొని వారి ప్రతిభ ప్రదర్శించనున్నారని చెప్పారు.

### గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

గన్నవరంరూరల్: గురుకులంలో 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి మార్చి 6లోగా దరఖాస్తు చేసుకోవాలని వీరపనేనిగూడెం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వై.యశోదలక్ష్మి చెప్పారు. గురువారం ఆమె మాట్లాడుతూ.. దరఖాస్తు చేసుకునేందుకు ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న బాలికలు, 10వ తరగతి చదువుతున్న బాలికలు అర్హులన్నారు. ప్రవేశ పరీక్షల ద్వారా విద్యార్థుల ఎంపిక చేస్తామని చెప్పారు. ఏప్రిల్ 6వ తేదీన ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. 91216 14398 నంబర్‌లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

## అదృశ్యమైన విద్యార్థినులు క్షేమంగా ఇళ్లకు చేరిక

గన్నవరం: తల్లిదండ్రులు మందలించారని మనస్తాపానికి గురైన ఐదుగురు విద్యార్థినులను గంటల వ్యవధిలోనే గన్నవరం పోలీసులు గుర్తించి గురువారం తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించారు. పోలీసుల సమాచారం ప్రకారం.. మండలంలోని ముస్తాబాద గ్రామానికి చెందిన నాలుగురు, మాచవరానికి చెందిన మరో విద్యార్థిని విజయవాడలోని ఓ కార్పొరేట్ కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నారు. ఐదు రోజుల క్రితం ఇళ్ల నుంచి వెళ్లిన ఈ ఐదుగురు విద్యార్థినులు కళాశాలకు వెళ్లకుండా విజయవాడలోని షాపింగ్‌మాల్స్‌లో కాలక్షేపం చేశారు. ఈ విషయం తల్లిదండ్రులకు తెలియడంతో వారిని తీవ్రంగా మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన వారు రహస్యంగా హైదరాబాద్ వెళ్లేందుకు ప్రణాళిక చేసుకున్నారు. ఈ మేరకు నలుగురు విద్యార్థినులు ఇంటిలో చెప్పకుండా, మరో విద్యార్థిని హైదరాబాద్‌లో పరీక్షల ఉన్నాయని కుటుంబ సభ్యులకు చెప్పి విజయవాడ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. అనంతరం కొణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో గుంటూరు జంక్షన్ మీదుగా హైదరాబాద్ బయలుదేరారు. అయితే ఒక విద్యార్థి తండ్రి తన కుమార్తె కనిపించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు.

దీంతో పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సదరు విద్యార్థినులు పిడుగురాళ్ల వద్ద రైలులో ఉన్నట్లు గుర్తించి తమ అధీనంలోకి తీసుకున్నారు. అనంతరం విద్యార్థినులను గన్నవరం తహసీల్దార్ కార్యాలయానికి తీసుకువచ్చారు. తహసీల్దార్ కె. వెంకటశివయ్య, సీఐ శివప్రసాద్ విద్యార్థినులతో పాటు వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం విద్యార్థినులను తల్లిదండ్రులకు అప్పగించి ఇళ్లకు పంపించారు.

## వీరపనేనిగూడెం గురుకుల పాఠశాలకు రీజనల్ ప్రతిభ అవార్డు

గన్నవరంరూరల్: మండలంలోని వీరపనేనిగూడెం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు రీజనల్ అవార్డులు సాధించారు. మంగళగిరిలో ఈ నెల 18వ తేదీన విప్రో సంస్థ నిర్వహించిన ప్రాజెక్టు కాంపిటీషన్‌లో సస్టైనబులిటీ బయోడైవర్సిటీ ప్రాజెక్టుకు రీజనల్ అవార్డు లభించింది. స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ విజయ రామరాజు ఏపీ విద్యా భవన్‌లో రూ.10 వేలు నగదు పురస్కారం, మెమెంటో, సర్టిఫికెట్లు, విప్రో కిట్ అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వై.యశోదలక్ష్మి సేవలను కొనియాడారు. ఉపాధ్యాయులు రజని ప్రశాంతి మార్గదర్శకంలో విద్యార్థులు సహజ, తేజస్వి, ప్రణతి, మహి, సింధూజ ఈ ప్రాజెక్టు తయారు చేశారు. స్కూల్ ఎడ్యుకేషన్ కో ఆర్డినేటర్ విజయ్ దుర్గ, విప్రో ప్రతినిధి వెంకటరత్నం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ విజయ రామరాజు, ప్రిన్సిపాల్ యశోద లక్ష్మి

## విద్యార్థుల్లో వ్యవస్థాపక సామర్థ్యాలను మెరుగుపర్చాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసి వ్యవస్థాపక సామర్థ్యాలను మెరుగుపర్చేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపాలని ఈఎండీపీ జిల్లా మేనేజర్ ఎం.బాలకిరణ్ అన్నారు. బాపులపాడు మండలం కానుమోలులోని జెడ్పీ హైస్కూల్‌లో ఎస్‌సీఈఆర్టీ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో అమలవుతున్న ఎంట్రాప్రెన్యూరియల్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఈఎండీపీ) పనితీరును గురువారం ఆయన పరిశీలించారు. విద్యార్థుల్లో కొత్త ఆలోచనలను ప్రోత్సహించాలని, నైపుణ్యాలను పెంపొందించాలని బాలకిరణ్ చెప్పారు. విద్యార్థి దశ నుంచే వ్యవస్థాపక మనస్తత్వాలను, ఆలోచనా విధానాన్ని రేకెత్తించాలన్నారు. భవిష్యత్‌లో వివిధ రంగాల్లో పారిశ్రామిక వేత్తలుగా, వ్యాపారవేత్తలుగా విద్యార్థులను తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. అనంతరం మలినసీటిని శుద్ధీకరించటంలో వివిధ దశలపై రిసోర్స్‌పర్సన్ కె.ఎ.ఎస్. దయాకర్ బాబు విద్యార్థులకు ప్రయోగాత్మకంగా వివరించారు. ప్రధానోపాధ్యాయురాలు ఎస్. పద్మజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మహా శివరాత్రికి సిద్ధమవుతున్న శివాలయాలు

నున్న(విజయవాడరూరల్): హిందువులకు ప్రీతిపాత్రమైన మహాశివరాత్రికి శివాలయాలు సిద్ధమవుతున్నాయి. మహాశివరాత్రిని పురస్కరించుకొని నున్న గ్రామంలోని శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానం, శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానం, శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానాలకు రంగులు వేసి శోభాయమానంగా తీర్చిదిద్దుతున్నారు. దేవదాయశాఖకు చెందిన ఈ మూడు దేవాలయాల్లో మహాశివరాత్రి రోజున ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ ప్రధాన అర్చకుడు డాక్టర్ మామిళ్లపల్లి ఫణికుమార్ తెలిపారు. మహాశివరాత్రి పర్వదినం నాడు శ్రీరామలింగేశ్వరస్వామి వారిని భక్తులు భక్తిశ్రద్ధలతో దర్శించుకుని పూజిస్తారు.

మహాశివరాత్రిని పురస్కరించుకొని మండలంలోని కొత్తూరు తాడేపల్లి, ఎనికేపాడు, నిడమానూరు, గొల్లపూడి గ్రామాల్లోని శివాలయాలను సిద్ధం చేస్తున్నారు.



నున్నలో శివాలయానికి రంగులు వేస్తున్న కార్మికులు

### బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ



కృష్ణలంక(విజయవాడ తూర్పు): మహిళల స్వయం ఉపాధికి మెప్మా, ఎన్ఎస్‌డీసీ సంయుక్త ఆధ్వర్యంలో బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పూజిత మహిళ సొసైటీ అధ్యక్షురాలు ఎర్రబోతుల కోటేశ్వరి పేర్కొన్నారు. గురువారం కృష్ణలంకలోని బాలాజీనగర్, రాణిగారితోటలో ఉచిత శిక్షణ కేంద్రంలో తరగతులు ప్రారంభించారు. ముఖ్య అతిథిగా యూసీడీ పీఓ వెంకటనారాయణ పాల్గొని తరగతులను ప్రారంభించి బ్యూటీషియన్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా కోటేశ్వరి మాట్లాడుతూ ఈ నెల 20నుంచి మార్చి 3వ తేదీ వరకు సుమారు 200 మందికి నాలుగు బ్యాచ్‌లుగా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. శిక్షణ పూర్తయిన వెంటనే అసెస్‌మెంట్ నిర్వహించి ఎన్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు ఇవ్వడంతో పాటు హోం ట్రయాంగిల్ యాప్‌లో ఆన్ బోర్డు చేసి ఉపాధి కల్పించామన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ టెక్నికల్ ఎక్స్‌ఫర్ట్ సుజాత, సీడీవో ఉమామహేశ్వరి, సీఓలు, ఆర్పీలు పాల్గొన్నారు.